ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 10 జనవరి 2024 | 5



రావులపాలెం పోలీసుస్టేషన్‌పై ఏసీబీ అధికారుల దాడి

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్‌ఐ, కంప్యూటర్ ఆపరేటర్

- వివరాలు 7లో



మండపేటలో దీక్షా శిబిరంలో వున్న అంగన్‌వాడీలకు నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన సీడీపీవో గజలక్ష్మి

మీరు పదోన్నతుల జాబితాలో ఉన్నారు... సమ్మెలో కొనసాగితే మీ స్థానంలో కొత్తవారు వచ్చే అవకాశం వుంది. విధుల్లో చేరి పదోన్నతిని కాపాడుకోండి... ఇలా నయానో భయానో అంగన్‌వాడీలను భయపెట్టడానికి వైసీపీ ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నిస్తోంది. ఎస్మా ప్రయోగించినప్పటికీ ఉద్యోగులు సమ్మె బాట వీడకపోవడంతో వారు ఏదో ఒక విధంగా విధుల్లో చేరేలా అధికారులు ఒత్తిడి తెస్తోంది.

బెదిరింపుల పర్వం

- అంగన్‌వాడీలకు నోటీసులు జారీ చేయిస్తున్న ప్రభుత్వం
- మండపేటలో నిరాకరించిన ఉద్యోగులు

మండపేట/అమలాపురం రూరల్, జనవరి 9: అంగన్‌వాడీలకు నోటీసులను నాలుగు రకాలుగా ఇచ్చేందుకు వైసీపీ ప్రభుత్వం ఒడిగట్టింది. ఒక నోటీసును అంగన్‌వాడీ కేంద్రం వద్ద అతికిస్తున్నారు. కొంతమందికి ముందుగా ఫోన్ చేసి చెప్తారని సమాచారం. అయినా సమాధానం చెప్పకపోతే సచివాలయ ఉద్యోగులు అంగన్‌వాడీల ఇంటికి స్వయంగా వెళ్లి నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేస్తారు. అక్కడ సదరు ఉద్యోగి లేకపోతే ఇంటి గోడకు అతికిస్తారు. ఇరుగు, పొరుగులకు చెందిన ఇద్దరితో సంతకం చేయించుకుంటారు. అంతేగాక రిజిస్టర్ పోస్టులో కూడా నోటీసు పంపించడంపై ప్రభుత్వ దృష్టిసారించింది. ఐసీడీఎస్ ఉద్యోగుల ద్వారా కూడా నోటీసులు ఇవ్వనున్నారు. ఇలా కొంతమందినైనా భయపెడితే విధుల్లో చేరతారనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. కానీ జీతం పెంచకుండా, తమ సమస్యలను పరిష్కరించకుండా డ్యూటీకి రామని, పరిష్కారం దొరికే వరకు వెనక్కి తగ్గేదే లేదని అంగన్‌వాడీలు చెప్తున్నారు. వైసీపీ నేతలు, అధికారుల ఒత్తిడి వల్ల ఒకరో, ఇద్దరో విధులకు హాజరవుతుండడం గమనార్హం.

మంగళవారం మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్షా శిబిరానికి ఐసీడీఎస్ కపిలేశ్వరపురం సీడీపీవో గజలక్ష్మి వచ్చారు. సమ్మె విరమించి విధుల్లో చేరాలని నోటీసులు జారీ చేయగా వాటిని తీసుకునేందుకు అంగన్‌వాడీలు నిరాకరించారు.





మానేపల్లిలో గోదావరి నదీపాయకు అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం (పైన), డ్రెడ్జర్‌తో అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం

లంక భూముల్లో తువ్వ మట్టి మేటలు వేసిందని, వ్యవసాయం చేసుకోవాలంటే కొంతమేర పూడిక తొలగించాలని సంబంధిత రైతుల పేరిట అధికారులకు దరఖాస్తు చేస్తున్నారు. ఆ మట్టిని ప్రభుత్వ పనులకు తరలిస్తామని చెప్తున్నారు. పక్కా ప్రణాళికతో తవ్వకాలు జరిపేందుకు అనుమతి కోరుతూ అధికారులకు ఎన్‌వోసీకై మట్టి మాఫియా దరఖాస్తు సమర్పిస్తోంది. అది అధికారుల వద్ద పరిశీలనలో ఉండగానే వారు ప్రణాళికకు శ్రీకారం చుడుతున్నారు. ఇంత జరుగుతున్నా మట్టి మాఫియాకు రాజకీయ అండదండలతో పాటు కొంతమంది పెద్దల స్నేహ హస్తం ఉండడంతో అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

నదీపాయకు అడ్డుక(గ)ట్టు

- అనుమతి లేకుండా... డ్రెడ్జర్ సహాయంతో ఇష్టారాజ్యంగా
- గోదావరి పాయల మధ్య భూముల్లో తవ్వకాలకు ప్రణాళిక
- వర్క్ ఆర్డర్ పేరిట ఎన్‌వోసీకి అధికారులకు దరఖాస్తు
- అడ్డుకట్ట పనులను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

పి.గన్నవరం, జనవరి 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మానేపల్లి గ్రామంలో నదీపాయలకు మధ్య ఉన్న లంక భూముల్లో మట్టి తవ్వకాలకు కొంతమంది రంగం సిద్ధం చేసుకున్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన అమలాపురంలో ఒక ప్రభుత్వ పని నిమిత్తం మట్టి అవసరమని... ఇందుకు పెరుగులంకతో పాటు ఒక రైతు వద్ద జిరాయితీ భూమిలో మట్టి తవ్వకాల కోసం రెవెన్యూ అధికారులకు ఎన్‌వోసీ నిమిత్తం దరఖాస్తు సమర్పించారు. నదీపాయకు అడ్డుకట్ట వేసుకునేందుకు హెడ్ వర్క్స్ అధికారులకు కూడా దరఖాస్తు పెట్టారు. అయితే ఆ రెండు శాఖల నుంచి ఏ విధమైన అనుమతులూ రాకుండానే నదీపాయకు అడ్డుకట్ట వేసే పనులను మట్టి మాఫియా ప్రారంభించింది. డ్రెడ్జర్ సహాయంతో ఇసుకను ఒక గుట్టగా వేసి అవతలి ఒడ్డుకు మట్టి లారీల రాకపోకల నిమిత్తం దారి వేశారు. ఈ చర్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు శాఖల అధికారులు పరిశీలనకు రాకుండానే పనులు ప్రారంభించడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

మరోపక్క ఇప్పటికే మండలంలో వర్క్ ఆర్డర్ల పేరిట అనుమతులు తీసుకున్న మట్టి మాఫియా మట్టి లారీలను పక్కతోవ పట్టిస్తోందన్న ఆరోపణలూ వున్నాయి. ఈ నేపథ్యంలో మానేపల్లిలో మట్టి తవ్వకాలు కూడా ఇదే బాట పడతాయని పలువురు బాహాటంగా వ్యాఖ్యానిస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొన్ని ర్యాంపులను నిలుపుదల చేసినట్టు సమాచారం. మండలంలో మట్టి అక్రమ తవ్వకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ 'స్పందన'లో తమ పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశామని జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు తెలిపారు.

అనుమతి లేకుండా పనులు ప్రారంభిస్తే చర్యలు తప్పవు
జీఆర్ రాగూర్, తహసీల్దారు

మానేపల్లిలో అనుమతి లేకుండా నదీపాయకు అడ్డుకట్ట వేస్తే సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మట్టి తవ్వకాలకు గానీ, నదీపాయపై అడ్డుకట్ట వెయ్యడానికి గానీ ఇప్పటివరకు ఏ విధమైన అనుమతులూ మంజూరు చెయ్యలేదు. ఆయా దరఖాస్తులను మైన్స్ అధికారులకు పంపించాం. అనుమతులు వచ్చేదాకా పనులు చేపట్టరాదని ఆదేశాలు కూడా జారీ చేశాము. అంతేగాక అక్కడ పర్యవేక్షణ నిమిత్తం గ్రామ రెవెన్యూ సిబ్బందిని ఉంచాము.



కలెక్టరేట్ గేట్లు తోసుకుని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారిని అడ్డుకుంటున్న పోలీసులు

కలెక్టరేట్ ముట్టడి

- ఎస్మా చట్టాన్ని తక్షణం ఉపసంహరించాలి
- అంగన్‌వాడీలకు మద్దతుగా కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నించిన ప్రధాన పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు... ఉద్రిక్తత

అమలాపురం, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల ఉద్యమాన్ని అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు డిమాండు చేశారు. అంగన్‌వాడీల ఉద్యమానికి అండగా ఉంటామని వారు ప్రకటించారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మె మంగళవారం 29వ రోజుకు చేరుకుంది. ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని నిరసిస్తూ సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, జనసేనలతో పాటు సీఐటీయూ, ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీ, రైతు సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించి భారీ ధర్నా చేపట్టారు. ఒక దశలో కలెక్టర్ బయటకు రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్ గేట్లు తోసుకుని లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.2ను తక్షణం రద్దు చేసి అంగన్‌వాడీలకు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల సుభాషిణి, జనసేన అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీపీఐ ఉమ్మడి జిల్లా నాయకుడు కొప్పుల సత్తిబాబు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర శాఖ గౌరవాధ్యక్షుడు చెలికాని స్టాలిన్ డిమాండు చేశారు. మండుటెండలో గంటల తరబడి కలెక్టరేట్ ఎదుట ధర్నా కొనసాగించారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, జీవో నెం.2 రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో జనసేన నాయకులు యేడిద శ్రీను, కొప్పుల నాగమానస, లింగోలు పండు, కాంగ్రెస్ నాయకులు యార్లగడ్డ రవీంద్ర, మాచవరపు



కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకుల బృందం

శివన్నారాయణ, కుడుపూడి శ్రీనివాస్, రాయుడు రమణ, రాయుడు గంగాభవానీ, టీఎన్‌టీయూసీ నాయకుడు వలవల శివరావు పాల్గొన్నారు. కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల శిబిరంలో కూర్చున్న వారికి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి పి.అమూల్య, ప్రధాన కార్యదర్శి కె.బేబీగంగారత్నం నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. మంగళవారం చేపట్టిన రిలే దీక్షా శిబిరాన్ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి ప్రారంభించారు. నిర్బంధాలతో ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించని రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. దీక్షలో ఐసీడీఎస్ ముమ్మిడివరం ప్రాజెక్టు నుంచి 21 మంది అంగన్‌వాడీలు పాల్గొన్నారు. వివిధ సంఘాల నాయకులు టి.నాగవరలక్ష్మి, ఇసుకపట్ల మంగాదేవి, బి.ఎస్తేరురాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట మండుటెండలో బైఠాయించి నిరసన తెలుపుతున్న వందలాది మంది అంగన్‌వాడీలు

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

జిల్లా నుంచి 250 సర్వీసులు

జిల్లా ప్రజా రవాణా అధికారి నాగేశ్వరరావు



అమలాపురం రూరల్, జనవరి 9: సంక్రాంతికి దూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం జిల్లా నుంచి 250 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు కోనసీమ జిల్లా ప్రజా రవాణాధికారి ఆర్వీఎస్ నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి జిల్లాలోని సొంత గ్రామాలకు వచ్చేవారి కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11, 12, 13 తేదీల్లో 57 బస్సులను ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. అవసరమైతే వీటి సంఖ్యను మరింత పెంచుతామన్నారు. పండుగల తర్వాత ఈ నెల 16 నుంచి హైదరాబాద్ వెళ్లేవారి కోసం ఆన్‌లైన్‌లో ప్రత్యేక బస్సు సర్వీసులు ఉంచామని తెలిపారు. హైదరాబాద్ నుంచి రావడానికి, తిరిగి వెళ్లడానికి ఒకేసారి టిక్కెట్లు తీసుకుంటే 10శాతం రాయితీ ఇస్తామన్నారు. విజయవాడ, వైజాగ్ తదితర ప్రాంతాలకు కూడా వంద ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. ప్రైవేటు ట్రావెల్ బస్సులు అత్యధికంగా చార్జీలు వసూలు చేస్తున్నా ఆర్టీసీ మాత్రం సాధారణ చార్జీలతోనే బస్సులు నడుపుతోందని నాగేశ్వరరావు వివరించారు. సమావేశంలో అమలాపురం డిపో మేనేజరు సీహెచ్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

25వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు... 8లో

సమస్యలు పరిష్కరించకుంటే

24 నుంచి నిరవధిక సమ్మె

- 108 అంబులెన్సు సిబ్బంది సమ్మె నోటీసు

అమలాపురం టౌన్, జనవరి 9: వైద్య, ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న 108 అంబులెన్సు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 24వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని మంగళవారం కలెక్టరేట్ పరిపాలనాధికారి కాశీవిశ్వేశ్వరరావుకు సమ్మె నోటీసు అందజేశారు. గతంలో వైద్య, ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాల్లో 108 ఉద్యోగులకు వెయిటేజీ ఇచ్చారని, ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్న తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. డీఎంఈ నోటిఫికేషన్‌తో భర్తీ చేస్తున్న ఈఎంటీ పోస్టుల్లో 108 అంబులెన్సులోని ఈఎంటీలను కాంట్రాక్టు పద్ధతిపై నియమిస్తూ ప్రాధాన్యత కల్పించాలని, 108 పైలెట్లను ఆర్టీసీ, ఏ ఇతర ప్రభుత్వ శాఖలోనైనా కాంట్రాక్టు డ్రైవర్ పోస్టుల్లో నియమించాలని, ఈఎంటీ, పైలెట్‌లను ఆప్కోస్‌లో చేర్చాలని, తల్లీబిడ్డా ఎక్స్‌ప్రెస్‌ల్లోని ఉద్యోగులను ఆప్కోస్‌లో చేర్చాలని, జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని, 104 ఎంఎంయూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్న ప్రధాన డిమాండ్లతో సమ్మె నోటీసు అందజేశారు. ఈ నెల 23లోగా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే 24వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపడతామని ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా శాఖ అధ్యక్షుడు జితేంద్ర తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎంఎస్ఎస్ శ్రీనివాస్, సంఘ జిల్లా నాయకులు డీవీ రావు, మణిదీప్, ఆంజనేయులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన 108 అంబులెన్సు యూనియన్ నాయకులు

ఎస్మా జీవో ప్రతులను వైనతేయ గోదావరిలో కలిపేసిన అంగన్‌వాడీలు

....వివరాలు 7లో

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి: డీపీవో



అమలాపురం టౌన్, జనవరి 9: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని జిల్లా పంచాయతీ అధికారి వంగా కృష్ణకుమారి సూచించారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు జిల్లా స్థాయి శిక్షణను మంగళవారం డీపీవో ప్రారంభించి మాట్లాడారు. గ్రామసభల నిర్వహణ ద్వారా గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించే విధానాన్ని ఆమె వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు. అమలాపురం, రామచంద్రపురం డీఎల్పీవోలు పి.బొజ్జిరాజు, కృష్ణారెడ్డి, ట్రైనర్లుగా మామిడికుదురు ఈవోపీఆర్డీ శ్రీనివాస్, గరగ రామకృష్ణ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలోని ఎంపీడీవోలు, కార్యదర్శులు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు హాజరు కాగా ఎంపీడీవోలు జె.వెంకటేశ్వరరావు, బి.మంగాదేవి, ఈవోపీఆర్డీ జి.మల్లికార్జునరావు, కార్యదర్శి రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు పాల్గొన్నారు.

అవి శాశ్వత కులధ్రువీకరణ పత్రాలే: డీఆర్వో సత్తిబాబు



అమలాపురం టౌన్, జనవరి 9: అధికారులు జారీ చేసిన అన్ని కుల ధ్రువీకరణ పత్రాలు శాశ్వత స్వభావం కలిగి ఉంటాయని, వాటిని ప్రస్తుత, భవిష్యత్తు అవసరాలకు నిరంతరం వాడుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు కోరారు. ఉద్యోగార్థులు తమ వద్దనున్న ఒరిజినల్ కమ్యూనిటీ సర్టిఫికెట్ వివరాలు అందించి సంబంధిత అధికారులకు దరఖాస్తు సమర్పించాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్ పోగొట్టుకున్న పరిస్థితిలో అఫిడవిట్ అందించాలి. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తరగతులు, వెనుకబడిన తరగతుల వారు గతంలో జారీ చేసిన కులధ్రువీకరణ పత్రాలను శాశ్వతంగా వినియోగించుకోవచ్చని డీఆర్వో చెప్పారు.

భూ సేకరణ త్వరితగతిన

పూర్తి చేయాలి

అమలాపురం టౌన్, జనవరి 9: జిల్లాలో జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్ కింద అక్రిడిటేషన్ పొందిన వారి కోసం భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీవోలను జేసీ నుపూర్‌అజయ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన మంగళవారం జర్నలిస్టు హౌసింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.



ఇప్పటివరకు జిల్లాలో 225 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాలు పొందేందుకు అర్హులుగా కమిషనర్ కార్యాలయం నుంచి సమాచారం అందిందన్నారు. జర్నలిస్టులు కోరిన ప్రాంతాల్లో స్థల సేకరణ జరపాలని అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, ఎం.ముక్కంటి. ఎస్.సుధాసాగర్‌లకు సూచించారు. సమావేశంలో సీహెచ్‌వీవీ సూర్యనారాయణరాజు, డి.సాయిమెహర్, ఏఎస్ ప్రసాదరావు, కన్వీనర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు తునికి చంద్రబాబు రాక


సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న టీడీపీ శ్రేణులు

- రా కదిలిరా సభలో ప్రసంగించనున్న టీడీపీ అధినేత
- సభా ప్రాంగణంలో పూర్తయిన భారీ ఏర్పాట్లు

తుని రూరల్, జనవరి 9: టీడీపీ, జనసేన పొత్తు అనంతరం పార్లమెంట్ పరిధిలో టీడీపీ అధినేత చంద్రబాబు తొలి సభ కావడం, చంద్రబాబు అక్రమ అరెస్ట్, విడుదల, జగన్‌పాలనలో మోసపోయి రోడ్డెక్కిన వివిధ వర్గాల ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో తునిలో సభ జరగడంతో చంద్రబాబు సభకు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో పార్లమెంట్ పరిధిలో తొలిసభ కావడంతో మాజీమంత్రి, ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు నేతృత్వంలో కాకినాడ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బండారు సత్యనారాయణమూర్తి, జిల్లాఅధ్యక్షుడు జ్యోతుల నవీన్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పలు సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాకినాడ పార్లమెంట్‌లో 7నియోజకవర్గాలతో పాటుగా పాయకరావుపేట, నర్సీపట్నం, తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణంవద్ద భారీ ఏర్పాట్లు చేశారు.

● భారీ వేదిక ముస్తాబు

తునిలో చంద్రబాబు సభకు పక్కాఏర్పాట్లు చేశారు. లక్షమంది జనసమీకరణతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. వేదిక నిర్మించడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఆర్కె ఈవెంట్స్ బృందం స్టేజ్‌ఏర్పాటు పనులు శరవేగంగా చక్కబెడుతోంది. ఏపీలో ఎక్కడ సభ జరిగితే అక్కడ వేదిక నిర్వహించే ఈ బృందం 48గంటల ముందే చేరుకుని 10వాహనాలతో 100కు పైగా కార్మికులతో పగలు, రాత్రి శ్రమించి పనులు పూర్తిచేశారు. వేదికపై 80 మంది కూర్చోవడానికిసరిపడా నిర్మాణం పూర్తి చేశారు. 60 అడుగులు పొడవు, 40అడుగుల వెడల్పు, 5అడుగుల ఎత్తులో వేదికను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.

● సభకు పోలీసుల పర్యవేక్షణ

తునిలో చంద్రబాబు సభను పర్యవేక్షించేందుకు పోలీస్ అధికారులు సన్నద్ధమయ్యారు. నేడు జరగనున్న సభకు పెద్దఎత్తున జనాలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఇప్పటికే డీఎస్పీ లతాకుమారి సభా ప్రాంగణంవద్ద ఏర్పాట్లు, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. 150మంది పైబడి పోలీసులు చంద్రబాబు సభ వద్ద విధులు నిర్వహించనున్నారు. భారీ వాహనాలు దారి మళ్లించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో జాతీయ రహదారి గుండా వచ్చేవాహనాలను జగన్నాధగిరి కూడలిమీదుగా రైల్వే బ్రిడ్జి కింద నుంచి సభావేదిక వద్దకు వాహనాలు రప్పించేందుకే ఏర్పాట్లు చేశారు. వీవీఐపీలకు, వీఐపీలకు, సాధారణ కార్యకర్తలకు, ఆటోలకు, ద్విచక్రవాహనాలకు ఇప్పటికే పార్కింగ్ ప్రాంగణాన్ని నిర్దేశించి ఐడెంటీ బోర్డులు ఏర్పాటు చేశారు.

● చంద్రబాబు షెడ్యూల్ ఇలా

బొబ్బిలిలో సభ ముగించుకుని మధ్యాహ్నం 3.30గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరి 3.35గంటలకు చామవరంహెలిప్యాడ్‌వద్ద ల్యాండ్‌కానున్నారు. 3.45 గంటలకు ఎస్.అన్నవరం పరిధిలో గల సభా ప్రాంగణానికి చేరుకుంటారు. 3.45 నుంచి 5.45 వరకు బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడనున్నారు. 6గంటలకు తుని నుంచి బయలుదేరి 8గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

- జగన్ అడ్డగోలు హామీలతో అన్నివర్గాలు రోడ్డున పడ్డాయి
- రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు అవసరం ఎంతో ఉంది
- తుని మీడియా సమావేశంలో టీడీపీ నాయకుల వెల్లడి

తుని రూరల్, జనవరి 9: వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని జగన్ అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా ముంచాడని తునిలో టీడీపీ నేతలు మీడియా సమావేవంలో ధ్వజమెత్తారు. బుధవారం జరగనున్న సభ ఏర్పాట్లు, వైసీపీ ప్రభుత్వవిధానాలపై మాజీ మంత్రి, ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు, బండారు సత్యనారాయణ మూర్తి, చింతకాయల అయ్యన్నపాత్రుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ న్యాయపరమైన హక్కులు నెరవేర్చాలని, ఇచ్చిన హామీలునెరవేర్చాలంటూ అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు ఒప్పంద కార్మికులు రోడ్డు ఎక్కితే జగన్ ప్రభుత్వం స్పందించకపోగా వారిని భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. ప్రజలు కష్టాల్లో వారికి తోడుగా టీడీపీ ఎప్పుడు ఉంటుందన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు అవసరం ఎంతైనా ఉందని నాడు తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ఎన్టీఆర్ పిలుపుకు ఎంతటి స్పంద న వచ్చిందో అదేరీతిలో చంద్రబాబురా కదలిరా పిలుపుకు ప్రజలు ఉప్పెనలా తరలివస్తున్నారన్నారు. నేడు జరుగనున్న చంద్రబాబు సభకు పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాలతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి అంచనాకు మించి ప్రజలు చేరుకునే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇప్పటికే టీడీపీ, జనసేన కార్యకర్తలు ఈ సభను విజయవంతం చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు, టీడీపీ నాయకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు, రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరాజు పాల్గొన్నారు.


కార్పొరేషన్‌కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో అక్కినేని వనజ

తాడేపల్లి ప్యాలెస్ ముట్టడిస్తాం

- మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిందే
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 9 : ముఖ్యమంత్రి జగన్ గారు రాష్ట్రంలో మునిసిపల్ కార్మికుల సమస్యలు ఇప్పటికైనా పరిష్కరించి సమ్మెను విరమింపజేస్తారా లేక తాడేపల్లి ప్యాలెస్ ముట్టడించమంటారా అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. రాజమహేంద్రవరంలో మునిసిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా 6వ రోజు మంగళవారం కలిసి మద్దతు తెలిపారు. పారిశుధ్య కార్మికులు సమ్మెతో ఆగిన పనులు చేయించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయింపులు చేసే కంటే డిమాండ్స్‌ను నేరవేరిస్తే మంచిదన్నారు. జగన్ ఇచ్చిన హామీలనే నేరవేర్చకుండా ద్రోహం చేశారన్నారు. నిర్లక్ష్యం వీడకపోతే రెగ్యులర్ కార్మికులు చేసే పనులను ఔట్ సోర్సింగ్ కార్మికులు అడ్డుకుంటారని హెచ్చరించారు. మరొక పక్క నగరంలో చెత్త పేరుకుపోవడంతో పారిశుధ్య కార్మికులు సమ్మెను విరమింపచేయాలని కమిషనర్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయని కార్మిక నేతలు తెలిపారు. మహా ధర్నాలో కార్మికులు మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రెడ్డిరమణ, ముత్యాలు మురళీకృష్ణ, బంగారు నాగేశ్వరరావు, ధనుల దుర్గమ్మ, ముత్యాల నందకిషోర్, బంగారు గిరి, కాకి శారద, ఎం శివ, గిరి, భాగ్యలక్ష్మి, ముత్యాల పోలమ్మ పాల్గొన్నారు.

బీజేపీ, వైసీపీ పార్టీలను చిత్తుగా ఓడించాలి

- రైతులు, కార్మికులు, వర్కర్లను విస్మరించిన పార్టీలు
- 2024 ఎన్నికలు దేశ ప్రజలకు చాలా కీలకం
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సభల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 9 : రైతాంగ సమస్యలపై ప్రతి ఒక్కరూ రాజీలేని పోరాటం చేయాలని, వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీని రాష్ట్రంలో వైసీపీని చిత్తు చిత్తుగా ఓడించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రైతు ప్రతినిధులకు పిలుపునిచ్చారు. రాజమహేంద్రరంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు రెండోరోజైన మంగళవారం హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలకు కార్పొరేట్ కంపెనీలపై ఉన్న ప్రేమ రైతులపై లేదని, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సబ్సిడీలు కూడా ఇవ్వకపోవడంతో రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించడానికే మోదీ రామమందిరాన్ని తెరపైకి తెచ్చారని, అయోధ్య రామమందిరంలో విగ్రహప్రతిష్ఠకు వేలకోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికలు దేశప్రజలకు చాలా కీలకమైనవని, లౌకికవాదం కావాలో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్న బీజేపీ కావాలో ప్రజలు తేల్చుకోవాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆంధ్రపదేశ్‌లో పనిచేసిన ముఖ్యమంత్రులతో పోల్చుకుంటే జగన్మోహనరెడ్డిలాంటి నియంత మరొకరు లేరన్నారు. ఎన్నికల ముందు చెప్పిన ఏ ఒక్క హామీ జగన్ అమలు చేయలేదన్నారు. దీంతో వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రంలో వర్కర్లు, ఉద్యోగస్తులు సమ్మెబాట పడితే జగన్మోహనరెడ్డి పోలీసులతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. మా నాయకుడు మాట తప్పడు, మడమ తప్పడు. మోకాలు తిప్పడు, ఏం చెబితే అది చేస్తాడు అంటూ వైసీపీ నేతలు పదే పదే భజన చేస్తుంటారని, కానీ జగన్మోహనరెడ్డి చట్టాన్ని అంగీకరించడు, కోర్టు చెప్పింది వినడు. చివరకు తాను చెప్పింది కూడా అమలు చేయడు అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, అఖిలభారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ, ఆయా జిల్లాల రైతు ప్రతినిధులు మాట్లాడారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.రామచంద్రయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, కాటమయ్య, డేగా ప్రభాకర్, జమలయ్య లక్ష్మి, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘం రాష్ట్ర సభలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

లారీ ఢీకొని ఒకరి మృతి


ఆలమూరు, జనవరి 9: ఆలమూరు మండలం పెదపళ్ల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన ఈతకోట శ్రీనివాసరావు(45) వెదురుమూడివెళ్లి కొత్తూరు సెంటర్ వైపు ఎలక్ట్రిక్ స్కూటర్‌పై వస్తుండగా పెదపళ్ల కోళ్ల ఫారం సమీపంలో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఈమేరకు ఆలమూరు ఎస్ఐ శీనునాయక్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రావులపాలెం పోలీసుస్టేషన్‌పై ఏసీబీ అధికారుల దాడి

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఎస్ఐ, కంప్యూటర్ ఆపరేటర్


ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఎస్ఐ వెంకటరమణ, ఆపరేటర్ సత్యప్రసాద్

రావులపాలెం, జనవరి 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావుల పాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ వెంకటరమణ, కంప్యూటర్ ఆపరేటర్ సత్యప్రసాద్‌లు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరుకు చెందిన సత్తి విజయ రామ కృష్ణారెడ్డి జియో ఫైబర్ డిస్ట్రి బ్యూటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల రావుల పాలెంలో జియో ఫైబర్ డిస్ట్రి బ్యూటర్‌కు చెందిన ఫైబర్ నెట్ కేబుల్ కారణంగా ఒక బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మరణించాడని ఏసీబీ అధికారులు తెలిపారు. దీంతో విజయరామ కృష్ణారెడ్డిని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. ఎఫ్ఆర్ఐ నమోదులో తక్కువ శిక్ష పడే సెక్షన్(304ఏ) వేసి స్టేషన్ బెయిల్ ఇచ్చే విధంగా చేస్తామని దానికి రూ.లక్ష లంచం ఇవ్వాలని పోలీసులు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. రావులపాలెం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఎస్ఐ ఆదేశాలతో కంప్యూటర్ ఆపరేటర్ సత్యప్రసాద్ రూ.25వేలు బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా రాజమహేంద్రవరం నుంచి అవినీతి నిరోధకశాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పటుకున్నారు. ఎస్ఐ, కంప్యూటర్ ఆపరేటర్‌ను అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామ న్నారు. స్టేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇటువంటి దాడులు ఎప్పుడూ జరగలేదు. రక్షించాల్సిన పోలీసులే ఈవిధంగా లంచాలు డిమాండ్ చేస్తుంటే సామాన్య ప్రజలు సరైన న్యాయంకోసం ఎవ్వర్నీ ఆశ్రయించాలని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు.


విద్యార్థులు గల్లంతైన సీతపల్లి వాగు

ఆనందంగా వెళ్లి.. నిర్జీవులుగా..

- ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు
- 'ఇద్దరు విద్యార్థులను మింగేసిన సీతపల్లి వాగు'
- 12 గంటలకు తండ్రికి చివర్ కాల్

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి)/రంపచోడవరం : అల్లూరి జిల్లాలోని రంపచోడవరంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలో ఉన్న సీతపల్లి వాగులో ఇద్దరు విద్యార్థులను మింగేసి ంది. ఈ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాజమ హేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో మొదటి ఏడాది ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు సోమవారం(8)తో పూర్తయ్యాయి. 11వ తేదీ నుంచి సెలవులు. దీంతో 10మంది విద్యార్థులు ప్లెజర్ ట్రిప్ ప్లాన్ చేసుకున్నారు. కాలేజీలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుగుతుండడంతో ఐదుగురు విద్యార్థులు ఆగిపోయారు. మొదటి ఏడాది బీబీఏ(డిజిటల్ మార్కెటింగ్) చదువుతున్న ముగ్గురు అమ్మా యిలు, బీకాం చదువుతున్న ఇద్దరు అబ్బాయిలు ద్విచక్ర వాహ నాలపై రంపచోడవరం వైపు వెళ్లారు. సీతపల్లి వాగులో కేరింతలు కొడుతూ గడిపారు. అయితే షేక్ జబీర్(19)రాయిపై నుంచి సెల్ఫీ తీసుకుంటూ ప్రమాదవశాత్తూ జారి వాగులో పడిపోయాడు. అక్కడ లోతుగా ఉండడంతో కేకలు వేస్తుండగా రక్షి ద్దామని వెంటనే సుభర్షిని(19) వాగులోకి దూకింది. ఇద్దరూ ప్రవాహంలో గల్లంతయ్యారు. మిగతా ముగ్గురూ కేకలు వేయ డంతో స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. రంప చోడవరం పోలీసులు చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. రెండు మృతదేహాలను బయటకు తీసి రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


మృతురాలు శుభర్షిని, మృతుడు జబ్బీర్

● నాన్నకు చివరిసారిగా

రాజమహేంద్రవరంలోని శ్రీరాంనగర్‌కి చెందిన సుభర్షిని తండ్రి బెంగళూరులో ఉద్యోగం చేస్తుండడంతో భార్యతో అక్కడే నివాసం ఉంటున్నారు. దీంతో సుభర్షిని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. జబీర్ తల్లిదండ్రులు రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. జబీర్ తండ్రి ఫ్లెక్స్ బోర్డులు చేస్తుంటారు. అతడి అన్నయ్య కూడా ఆర్ట్స్ కళాశాలలోనే చదువుకుంటున్నాడు. జబీర్ ప్రతి గంటకూ తన తండ్రికి ఫోన్ చేశాడు. కానీ మధ్యాహ్నం 12గంటల సమయం నుంచీ ఫోన్ రావడం ఆగిపోయింది. 3గంటల సమయంలో విషాద విషయ●ం ఆయనకు తెలియడంతో రంపచోడవరం వెళ్లారు.

● నేటి కార్యక్రమాలు నిలిపివేత

ఆర్ట్స్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రిన్సిపాల్ రామచంద్రరావు నిర్వహిస్తున్నారు. బుధవా రం కైట్ ఫెస్టివల్, సంప్రదాయ వంటకాలు, సంప్రదాయ వస్త్రధా రణ తదితర కార్యక్రమాలు ఉన్నాయి. ఇద్దరు విద్యార్థుల మరణ వార్త తెలిసే సమయానికి ఆయన విజయవాడ అధికారిక సమావేశంలో ఉన్నారు. దుర్ఘటన తెలియగానే తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. బుధవారం జరగాల్సిన కార్యక్రమాలను రద్దు చేశారు. ఉదయం 11గంటలకు విద్యార్థుల సంస్మరణ సభను ఏర్పాటు చేశారు. సభర్షిని కాలేజీకి సంబంధించిన కార్యక్రమాల్లో చాలా యాక్టివ్‌గా, సమన్వయం చేసుకుంటూ ఉండేదని.. బీబీఏ విద్యార్థులకు డ్రెస్‌కోడ్ విషయంలో కూడా పట్టుబట్టి సాధించు కుందని.. ఓ మంచి విద్యార్థిని కాలేజీ కోల్పోయిందని రామచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి 'ఆంధ్రజ్యోతి'తో ఆవేదన వ్యక్తం చేశారు.

● సీతపల్లి వాగులో..

అడవుల్లోని కాలువలను దొంగ వాగులంటారు. ఎప్పుడు ప్రవాహం వస్తుందో ఎవరూ ఊహించలేరు. పైగా ఎక్కడ లోతుగా ఉంటుందో కూడా చెప్పడం కష్టం. ఈ వాగువద్ద రద్దీ వేళల్లో కూడా సరైన రక్షణ, పోలీసుల పర్యవేక్షణ ఉండడం లేదని స్థాని కులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందువల్లనే ఇద్దరు విద్యార్థులు బలైపోయారని మండిపడుతున్నారు.

గోదావరినదిలో కలిపేసిన ఎస్మా-2 జీవో ప్రతులు


పి.గన్నవరం వైనతేయ గోదావరి నదిలో ఏస్మా-2 జీవో ప్రతులను కలిపేస్తున్న అంగన్‌వాడీలు

పి.గన్నవరం, జనవరి 9: సమస్యలు పరిష్కరించే వరకు మేం తగ్గేదేలా... అంటూ అంగన్‌వాడీలు ఈనెల 6న ప్రభుత్వం విడుదల చేసిన ఏస్మా-2 జీవో ప్రతులను వైనతేయ గోదావరినదిలో కలిపేసి వినూత్న నిరసన తెలిపారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా 29వ రోజు మంగళవారం పి.గన్నవరం అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీగా గోదావరినది వద్దకు చేరుకుని సంబంధిత జీవో ప్రతులను నీటిలో కలిపేసి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ నాయకులు బండి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, జి.రాధ, ఎ.దుర్గామల్లేశ్వరి, ఆశాజ్యోతి, లలిత, కె.రాజ్యలక్ష్మి, జి.ప్రమీల, జి.అనంతలక్ష్మీదేవి పాల్గొన్నారు.

లాటరీ పేరుతో కుచ్చుటోపీ

- అనుమానం రాకుండా కొందరికి ఖరీదుకానీ వస్తువుల పంపకాలు
- ఒక్కొక్కరి నుంచి రూ. 3 వేల నుంచి రూ.7 వేల వరకు వసూళ్లు
- గిరిజన పల్లెలే లక్ష్యంగా రూ. లక్షల్లో వసూళ్లు
- వారం రోజులుగా ఫోన్ల స్విచ్ఛాఫ్... లబోదిబోమంటున్న బాధితులు

ఎటపాక, జనవరి 9 : వారంతా అమాయక గిరిజనులు.... రోజూకూలీకి, వ్యవసాయ పనులకు వెళితేగానీ పూట గడవనివారు... అలాంటి అమాయక త్వాన్ని ఆసరగా చేసుకుని, కొందరు కేటుగాళ్లు లాటరీ పేరుతో బురిడీ కొట్టించారు... రూ.లక్షల్లో వసూళ్లు చేసి, చివరకు బోర్డు తిప్పేసి, ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయామని, గ్రహించి గిరిజనులు లబోదిబోమంటున్నారు... .ఎటపాక మండలంలో చాలా మంది బాధితులు ఉండగా, ప్రధానంగా కృష్ణవరం, భూపతి రావుపేట, కొత్తూరు, కన్నాపురం, లక్ష్మీపురం, పాలమడుగు తదితర గ్రామాల్లోని గిరి జనులు ఉన్నారు. ఒక్కో గ్రామం నుంచి 300నుంచి 400 వరకు బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బాధితుల్లో రూ.3 నుంచి రూ.7 వరకు వసూళ్లు చేసినట్లు తెలుస్తో ంది. ఈ గిరిజన గ్రామాలో గత మూడు నెలలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక కేంద్రంగా శ్రీ హనుమాన్ ఈజీ ఇన్‌స్టాల్‌మెంట్ లాటరీ పేరుతో కొందరు కేటుగాళ్లు ఓ బ్రౌచర్ ముద్రించి, అందులో తొలుత ప్రారంభ వారానికి రూ.20 నుంచి చివరి వారం వరకు 307 వరకు స్కీమ్ ఉన్నట్లు ప్రచారం నిర్వహించారు. ప్రతీవారం గ్రామాల్లోకి వచ్చి డబ్బులు కట్టించుకుని సంతకాలు కూడా చేశారు.. అయితే ఈ లాటరీ స్కీమ్‌పై ఎవరికీ అనుమానం రాకుండా కొందరికి తక్కువ ఖరీదైన ప్లాస్కో, కుక్క ర్లు, లైట్లు, ఇడ్లీ పాత్రలు ఇచ్చి, లాటరీ తగిలిందని నమ్మ బలికించే ప్రయత్నం చేశారు. దాంతో ఒకే కుటుంబంలో ఇద్దరి నుంచి ముగ్గురి పేరున లాటరీ కట్టారు. అయితే కొందరి వద్ద నుంచి రూ.5వేలు కట్టించుకుని ఫ్రిజ్‌లు, డబుల్‌కాట్ మంచాలు, డ్రెస్సింగ్ టేబుళ్ల ఇస్తామని నమ్మబలికించారు. చివరకు ఫోన్లు సిచ్ఛాఫ్ చేసి, ఉడాయించడంతో బాధిత గిరిజనులు లబోదిబో మంటున్నారు. దాదాపుగా ఎటపాక మండలంలో కేటు గాళ్లు రూ.20 నుంచి రూ. 30లక్షల వరకు వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. సారపాకలో కూడా వారి ఆచూకీ లేనట్లు కొందరు బాధితులు పేర్కొంటున్నారు.

డాక్టర్ మురళీకృష్ణకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం


డాక్టర్ యనమదల మురళీకృష్ణ

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 9: సంక్రమణ వ్యాధులు, వాటి ప్రభావాలు ఇతర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ పుస్తకాలు, ఆర్టికల్స్ రాసి భరోసా నింపుతున్న డాక్టర్ యనమదల మురళీకృష్ణకు రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించింది. ఈనెల 11న ఏలూరులో జరగనున్న సాహిత్య సంక్రాంతి సంబరాల్లో డాక్టర్ మురళీ కృష్ణను విశిష్ట సాహిత్య పురస్కారంతో సత్కరించనున్నట్లు అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తెలిపారు.

చదువు, ఆరోగ్యమే నిజమైన సంపద

- కిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య
- మాతృభాషపై పట్టు ఉండాలి
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణ
- ఘనంగా శ్రీప్రకాష్ విద్యా సంస్థల వార్షికోత్సవం

పాయకరావుపేట/తునిరూరల్, జనవరి 9: తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే నిజమైన సంపద చదువు, ఆరోగ్యమేనని కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్) మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య అన్నారు. మంగళవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల 47వ వార్షికోత్సవ వేడుకలను 'జోష్' పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ, ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి విద్యార్థి గ్రహించాలని, నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. బాగా చదువుకుని, ఆరోగ్యం వుంటే కచితంగా ఉన్నతస్థితికి చేరుకుంటారన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మాతృభాషపై పట్టు వుంటేనే మిగిలిన భాషలపై పట్టు సాధించగలమని అన్నారు. జీవితంలో ఉత్తమ మార్గాన్ని ఎంచుకునే శక్తిసామర్థ్యం చదువు ద్వారానే వస్తుందన్నారు. మరో గౌరవ అతిథి బసవ తారకం ఇండో అమెరికన్ కాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సీఈవో డాక్టర్ కూరపాటి కృష్ణయ్య మాట్లాడుతూ, ఎటువంటి స్వార్థం లేకుండా జ్ఞానాన్ని పంచే గురువులను విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. జీవితంలో పైకి ఎదగాలంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని అన్నారు. సెకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ కొడాలి కేశవరావు, అడ్వాన్స్‌డ్ మైనింగ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ నాదెళ్ల వెంటసుబ్బారావు, ప్రతాప్ ఇండస్ట్రీస్ ఎండీ వైవీఎస్.చలపతిరావు తదితరులు మాట్లాడారు. తొలుత ఏపీ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. అనంతరం జాతీయస్థాయి ఆటల పోటీలు, వివిధ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ముందస్తు సంక్రాంతి సంబరాలను తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగా, పిరమిడ్స్, జుంబా డ్యాన్స్, వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ కంటిపూడి నరేంద్రబాబు, ,విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


శాంతి కపోతాలను ఎగురవేస్తున్న ముఖ్యఅతిథులు, విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రిటైర్డ్ స్పెషల్ సెక్రటరీ కె.లక్ష్మీనారాయణ, ఇన్‌సెట్లో మాట్లాడుతున్న దృశ్యం

ఎన్ఎస్ఎస్ సాహసయాత్ర విజయవంతం

దివాన్‌చెరువు, జనవరి 9: యువజన వ్యవహారాలు క్రీడాశాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ ఎలైడ్ స్పోర్ట్స్ కేంద్రం పోంగ్‌డామ్‌వద్ద నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సాహస యాత్రను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు విజయవంతంగా పూర్తి చేశారని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఈ యాత్రకు హాజరైన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. గతనెల 19 నుంచి 28 వరకూ ఈయాత్ర సాగిందన్నారు. దీనికి నన్నయ వర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో 10 మంది విద్యార్థులు, ఒక పీవో హాజరయ్యారన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.రాజశేఖర్, కాకినాడ ఎంఎస్ఎన్ క్యాంపస్ నుంచి ఐ.ఆనందబాబు, నన్నయ క్యాంపస్ నుంచి ఎస్.సందీప్, ఎస్.జానకిరామ్, పాలకొల్లు ఏఎస్ఎన్ఎం నుంచి జి.ఆది, భీమవరం బీవీ రాజు కాలేజ్ ఆఫ్ సైన్స్ నుంచి పి.దుర్గాగణేష్, గైట్ కళాశాల నుంచి సీహెచ్ చరిష్మా, రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల నుంచి పి.సాయిరత్నం, కిర్లంపూడి ఎస్వీపీఎస్ డిగ్రీ కళాశాల నుంచి ఆర్.ఉష, రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ కళాశాల నుంచి కె.హర్షిణి, పాలకొల్లు డీఎన్ఆర్ మహిళా కళాశాల నుంచి ఎస్.లక్ష్మీదేవి పాల్గొన్నారన్నారు. మైనస్ రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా తమ సాహసయాత్రను కొనసాగించారని వీసీ అభినందించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వై.శ్రీనివాసరావు వలంటీర్లకు, పీవోకు అభినందనలు తెలిపారు.

104 విభాగంలో ఉద్యోగాల భర్తీ

జీజీహెచ్ (కాకినాడ) జనవరి 9 వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా సేవలు అందిస్తున్న 104 మొబైల్ మెడికల్ యూనిట్లలో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ నుంచి మంగళవారం ప్రకటన వెలువడింది. ఇందులో 20 డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈవో), 20 డ్రైవర్ పోస్టులను అవుట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్‌వో డా. నరసింహనాయక్ తెలిపారు. అభ్యర్థులు ఎదైనా డిగ్రీ పూర్తి చేసిన కంప్యూటర్, టైపింగ్‌లో అనుభవం కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు డీఈవో పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అలాగే 10వ తరగతి పూర్తి చేసి హెవీ వెహికల్ లైసెన్స్ కలిగి ఉన్న పురుష అభ్యర్థులు డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ రెండు ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి 35 ఏళ్లుగా నిర్ణయించారు. అర్హత కలిగి ఆశక్తి ఉన్న అభ్యర్థులు వారి బయోడేటాకు విద్య అర్హతతోపాటు లైసెన్స్ పత్రాలను దరఖాస్తుకు జతచేసి ఈనెల 10, 11 తేదీలలో కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో ఉన్న 104, 108 కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

సెలవుల్లో పనికి వెళ్లి యువకుడి మృత్యువాత


మృతి చెందిన కోడి సంగీత్‌కుమార్

దేవరపల్లి, జనవరి 9: చదువుకుంటూ సెలవు రోజులు కావడంతో కూలిప నికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. చాగల్లు మండలం కలవలపల్లికి చెందిన ఏడుగురు యువకులు స్నేహితులు. వేర్వేరు చోట్ల చదువుకుంటున్నారు. ప్రస్తుతం సంక్రాంతి సెలవులు కావడంతో పనిలోకి వెళ్దామనుకున్నారు. మంగళవారం దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ట్రాక్టర్‌లో కొబ్బరాకులు లోడు చేసుకుని మధ్యాహ్నం తిరిగి కలవలపల్లి బయలుదేరారు. ట్రాక్టర్ లోడుపై నలుగురు, ట్రాక్టర్ ఇంజన్ మధ్యలో ఉన్న రాబర్ పైన ముగ్గురు నిలుచున్నారు. త్యాజంపూడి-యర్నగూడెం రోడ్డు గోతులమ యంగా ఉంది. ఎదురుగా వస్తున్న చెరుకు ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో రాబర్‌పై కూర్చున్న వారిలో కోడి సంగీత్‌కుమార్(19) ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. ట్రాక్టర్ అతని పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా సంగీత్‌కుమార్ నిడదవోలులో ఐటీఐ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి కూలి పనికి వెళ్లి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. సంఘటన ప్రాం తాన్ని ట్రైనీ డీఎస్పీ భానోదయ పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకు న్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'కొత్త పింఛను విధానం రద్దు చేయాలి'

రాజమహేంద్రవరం, జనవరి 9(ఆంధ్రజ్యోతి): కొత్త పింఛను విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఎంప్లాయీస్ సంఘ్ పిలుపుమేరకు రైల్వే ఉద్యోగులు రైల్వేస్టేషను ఆవరణలో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రైల్వేబోర్డు వెంటనే నిర్ణయం ప్రకటించాలని నినాదాలు చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జనరల్ సెక్రటరీ మర్రి రాఘవయ్య, విజయవాడ డివిజనల్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వ రరావు దిశా నిర్దేశంతో పోరాటం సాగిస్తున్నామని ఉద్యోగులు తెలిపారు. సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ శాఖల ఆధ్వర్యంలో కూడా నిరాహార దీక్ష చేశారు. కార్యక్రమంలో వి.త్రినాథ్, ఎస్ఎస్ చంద్రమౌళి, జేడీ ప్రసాద్, టి.నాగేంద్రరావు, అరవ నాగేంద్రకుమార్, డి.రమేశ్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు అందిస్తున్నాం

పి.గన్నవరం, జనవరి 9: నిరవధిక సమ్మెలో ఉన్న పి.గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు అందిస్తున్నామని సీడీపీవో వై.విజయశ్రీ తెలిపారు. ఈనెల19వ తేదీలోపు వారు విధుల్లోకి చేరకపోతే ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ముందుగా నోటీసులు నేరుగా అందించే ప్రయత్నం చేస్తున్నామని, తీసుకోకపోతే సంబంధిత సెంటర్‌కు అతికించడంతో పాటు రిజిష్టర్ పోస్టుల్లో వారి నివాసాలకు పంపుతున్నామన్నారు.

బీసీ వ్యతిరేకి సైకో జగన్‌ను తరిమికొట్టాలి

- టీడీపీకి బీసీలు వెన్నుముక
- 'జయహో బీసీ' సదస్సులో సత్యానందరావు

ఆలమూరు, జనవరి 9: టీడీపీ స్థాపన నుంచీ బీసీలు పార్టీకి వెన్నుముకగా నిలిచారని, పార్టీ కూడా అంతే ప్రాధాన్యమిచ్చి గౌరవించేదని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు చెల్లుబోయిన సింహచలం అధ్యక్షతన ఆలమూరులో మంగళవారం జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సత్యానందరావుమాట్లాడుతూ నాలుగున్నరేళ్లగా రాష్ట్రంలో బీసీలను అనేక రకాలుగా ఇబ్బందులుపెట్టి జగన్ సైకో పాలన సాగించారని, అనేక మంది బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. బీసీలను ఉప కులాలుగా విభజించడమే కాకుండా కార్పొరేషన్ల చైర్‌పర్సన్లగా చేసిన వారికి కూర్చోవడానికి కనీసం సీటు కూడా ఇవ్వలేక పోయారన్నారు. రాష్ట్రంలో ప్రాంతాలను విభజించి జగన్ తన సామాజికవర్గానికి చెందిన వారికి సామంతరాజులుగా పట్టంకట్టి దోచేశారని విమర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీసీలు సత్తా చూపి సైకో జగన్ పాలనకు స్వస్తి చెప్పాలని తీర్మానించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సదస్సులో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల రామకృష్ణ, జిల్లా, నియోజకవర్గాల బీసీ నాయకులు రెడ్డి రామకృష్ణ, వీరబాబు, కాలా సాయిబాబు, గుత్తుల శ్రీనివాస్, యల్లమిల్లి జగన్మోహన్, కేతా శ్రీనివాస్, అనుసూరి నాగరత్నం, వాకా సుబ్బలక్ష్మీదేవి, కాసా సాగర్, గుత్తుల పట్టాభి రామారావు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న బండారు సత్యానందరావు

బీసీల భవిష్యత్ టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యం

రాజోలు, జనవరి 9: బలహీనవర్గాల భవిష్యత్తు టీడీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. పొదలాడలో సర్పంచ్ కడలి సత్యనారాయణ స్వగృహం వద్ద మంగళవారం జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని కల్పించి, బీసీ సామాజిక వర్గాల్లో ఆత్మాభిమానాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి టీడీపీప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీ నాయకులు, కార్యకర్తలపైనా అమానుషంగా దాడులు, దౌర్జన్యాలుచేసి అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టారన్నారు. దీనికి పరిష్కారంగానే బీసీలకు రక్షణ చట్టాన్ని చంద్రబాబు తీసుకురాబోతున్నారని పేర్కొన్నారు. రానున్న టీడీపీ ప్రభుత్వంలో బీసీ సబ్‌ప్లాన్ నిధులు వారి అభ్యున్నతికే ఖర్చు చేయడానికి చంద్రబాబు చట్టాన్ని రూపొందిస్తారని తెలిపారు. ఎంపీపీ కేతా శ్రీను, కాండ్రేగుల సత్యనారాయణ మూర్తి, చాగంటి స్వామి, పిల్లి శ్రీరామమూర్తి, శంకరపు ఆదినారాయణ, వైస్‌ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, చాగంటి స్వామి, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల కుశులుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం

అంబాజీపేట, జనవరి 9: పేదలకు సంక్షేమ పథకాలు అమలు, అన్ని వర్గాలకు న్యాయం జరిగేది టీడీపీతోనేనని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగాబత్తుల వెంకటసుబ్బారావు అన్నారు. గంగలకుర్రు, వాకలగరువు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ఇంటింటికి బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దూనబోయిన బాబులు, కాగితపల్లి సాయిరామ్, బాబి పాల్గొన్నారు.

ప్రభల ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకుందాం

కొత్తపేట, జనవరి9: కొత్తపేటలో ఈనెల15న జరిగే సంక్రాంతి ప్రభల ఉత్సవాన్ని సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దంపట్టేలా ప్రశాంతంగా జరుపుకునేలా అందరూ సహకరించాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి, డీఎస్పీ కేవీ రమణ కోరారు. మంగళవారం వారు ఆర్డీవో కార్యాలయంలో ప్రభల ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఇక్కడ ప్రభల ఉత్సవం అనాదిగా ఎలా జరుగుతోందో ఉత్సవ కమిటీ నాయకుడు ముత్యాల వీరభద్రరావు వివరించారు. డీఎస్పీ, ఆర్డీవో మాట్లాడుతూ ఉత్సవంలో ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు అనమతులు లేవన్నారు. 500మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఉత్సవ ప్రభలపై రాజకీయ నాయకులు, సినీ నటుల ఫెక్సీలు ఏర్పాటు చేయొద్దని సూచించారు. బాణసంచా కాల్చే ప్రదేశాల వద్ద వచ్చే ప్రజలకు కనిపించకుండా వివిధ పార్టీల ఫ్లెక్సీలు పెట్టొద్దని, ఇప్పటికే పెట్టి ఉంటే వెంటనే తొలగిస్తామన్నారు. ఆడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గాని గంగాధరరావు, రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముద్రగడ సుబ్బారావు, విళ్ల మారుతీప్రసాద్, ఎస్ఐ జ్వాలాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

అల్లవరం, జనవరి 9: ఓఎన్జీసీ సౌజన్యంతో కుట్టు శిక్షణ పొందిన గోడిలంక, తుమ్మలపల్లి గ్రామాల మహిళలకు అల్లవరం బసవా మంగాయమ్మ కల్యాణ మండపంలో కుట్టు మిషన్లను అమలాపురం ఎంపీ చింతా అనురాధ బుధవారం పంపిణీ చేశారు. ఓఎన్జీసీ ఈడీ అమిత్‌నారాయణ్ మాట్లాడుతూ సామాజిక సేవలో తమ సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు పులుసుగంటి రాజేశ్వరి, మాకే కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు ఆర్థికసాయం

కె.గంగవరం, జనవరి 9: జాతీయ స్థాయి పోటీలకు పామర్రు ఉన్నత పాఠశాల నుంచి అండర్-14 జావెలెన్ పోటీలకు వీరకుమారి, అండర్-14 లాంగ్‌జంప్‌కు వి.హర్షవర్ధన్, కుందూరు ఉన్నత పాఠశాల నుంచి ట్రైత్లాన్ ఈవెంట్‌కు జి.కె.లక్ష్మి ఎంపికయ్యారు. వీరు ఫిబ్రవరి 16 నుంచి 18వరకు గుజరాత్ విశ్వవిద్యాలయంలోని సర్దార్ పటేల్ స్పోర్ట్స్ సిటీలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారు. వీరికి ప్రయాణ ఖర్చులకు టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వి.వి.ఎస్.ఎస్.చౌదరి రూ.10వేలు అందించారు. దాతను పామర్రు ఉన్నత పాఠశాల హెచ్ఎం పితాని శ్రీనివాసు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

లీలాకృష్ణ ఆరోపణలపై ఖండన

మండపేట, జనవరి 9: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపై జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ సోమవారం చేసిన ఆరోపణలను వైసీపీ నేతలు ఖండించారు. లీలాకృష్ణపై ఉన్న 15 కేసులు నుంచి బయటపడి అప్పుడు మాట్లాడాలని వైసీపీకి చెందిన నేతలు పలివెల సుధాకర్, ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజులు లీలాకు సూచించారు. తోటపై 27ఏళ్ల క్రితం నమోదైన కేసుపై మాట్లాడే అర్హత లీలాకృష్ణకు లేదన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో దళిత నేతలు, పలువురు పాల్గొన్నారు.

వెంకటనారాయణకు డాక్టరేట్

రాజోలు, జనవరి 9: తెలంగాణ రాష్ట్రం దుండిగల్ మర్రి లక్ష్మణరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాజోలుకు చెందిన కాపా వెంకటనారాయణకు మధ్యప్రదేశ్ సహోరేలోని శ్రీసత్యసాయి యూనివర్శిటీ ఆఫ్‌టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్ డాక్టరేట్ ప్రకటించింది. కాంపిటేటివ్ అనాలసిస్‌ఆఫ్ సైకలాజికల్ బిహేవియర్ ఆఫ్ తెలంగాణ సీనియర్ క్రికెటర్ ప్లేయర్స్ బిఫోర్ అండ్ ఆఫ్టర్ కాంపిటీషన్ అనేవిషయంపై చేసిన పరిశోధనకుడాక్టరేట్ పొందారు. స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేస్తారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

రాయవరం, జనవరి 9: వికసిత్ భారత్ సంకల్పయాత్ర మంగళవారం వెంటూరు, చెల్లూరు గ్రామాల్లో సాగింది. ప్రధాన మంత్రి మోదీ నేతృత్వంలో దేశంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు బీజేపీ నేతలు, అధికారులు వివరించారు. బీజేపీ నేత చాత్రాతి జానకిరాంబాబు, కేవీవీ సాయిరాం, చిరట్ల సుబ్బారావు, శాకా దుర్గా శ్రీనివాస్, వల్లభనేని రవీంద్రనాద్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం, జనవరి 9: గొల్లవిల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి పినిపే విశ్వరూప్ ప్రారంభించారు. తొలుత మండలంలోని లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. వాడపర్రులో ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ ట్యాంక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్‌లు జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, కడిమి చిన్నవరాజు, పెయ్యల రాజ్‌కుమార్, జోగి రాజా, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయ బోర్డు డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, ఎంపీటీసీలు వంగా గిరిజా నాగకుమారి, దోనిపాటి బాలమ్మ, సొసైటీల చైర్మన్లు మారిశెట్టి పుండరీకాక్షుడు, నడింపల్లి వాసు, బడుగు గణేష్, సలాది సతీష్, చప్పిడి దుర్గారావు పాల్గొన్నారు.

జోనల్‌స్థాయి బాడీ బిల్డింగ్ ట్రోఫీలు ఆవిష్కరణ

అమలాపురం టౌన్, జనవరి 9: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా ఈ నెల12న అమలాపురంలో జోనల్ స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్‌లో బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను ముఖ్య అతిథిగా హాజరైన ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం ఆవిష్కరించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, గౌరవాధ్యక్షుడు నగబేరి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు గారపాటి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులు జి.గణేష్‌బాబు, వి.నరేష్, ఎంవీ సముద్రం, కార్యదర్శి కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సందడి



గొల్లగూడెంలో సంక్రాంతి సంబరాల్లో చిన్నారులు

అమలాపురం టౌన్, జనవరి 9: సంక్రాంతి సంబరాలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం వేడుకగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలతో కనువిందు చేశారు. జానపద కళాకారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. భోగి మంటలు వేశారు. ప్రభలను ఊరేగించారు. గొల్లగూడెం ఆదిత్య పాఠశాలలో ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో వైస్ ప్రిన్సిపాల్ పి.విజయగౌరిపాల్గొన్నారు. కామనగరువు ఆదిత్య స్కూలులో ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భోగి పండ్లు ఆకర్షణగా నిలిచాయి. రెండెడ్ల బండిపై విద్యార్థినులు ఊరేగారు. ముగ్గుల పోటీ ఆకట్టుకుంది. సుధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సమనస శ్రీరామా పబ్లిక్ స్కూలులో ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్ ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అమలాపురం శ్రీనంద్ స్కూలులో యెనుముల విశ్వకనకం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

రామచంద్రపురం: స్థానిక చల్లావారివీధిలోని ప్రగతి ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో మంగళవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆటపాటలు, విచిత్ర వేషధారణలతో విద్యార్థులు అలరించారు. భోగి మంటలను ప్రిన్సిపాల్ తోట రజనీ వెలిగించారు కరెస్పాండెంట్ ఇన్‌చార్జ్ వి.కళ్యాణి లక్ష్మి, జి.రాంబాబు, సెక్రటరీ జి.లీలావతి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండపేట: మండపేట విజ్ఞాన్ స్కూల్‌లో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఇనపకోళ్ల గణేష్ సారధ్యంలో విద్యార్థులు భోగి మంటలు వెలిగించారు. సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు అలరించారు. హరిదాసు, పల్లె సంస్కృతికి తదితర కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

ముమ్మిడివరం: యాపిల్ స్కూలులో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాల అధినేత గోదశి పుండరీష్, సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించారు. భోగిమంటలు, డూడూ బసవన్నలు, చిన్నారులతో కోలాటాలు. సంక్రాంతి ముగ్గులు, ఎడ్ల బండ్ల సవారీలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజోలు: ములికిపల్లి నలంద పబ్లిక్ పాఠశాలలో కరస్పాండెంట్ రామకృష్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు భోగి మంటలు వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించారు. ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, డూడూ బసవన్నలు, హరిదాసు వేషధారణలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు సీఐ గోవిందరాజు బహుమతులు అందజేశారు. హరిబాబు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ అంశాలపై సీఎంతో చర్చ



యానాం, జనవరి 9: యానాం నియోజవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన సమస్యలపై పుదుచ్చేరి సీఎం ఎన్.రంగసామితో మంగళవారం పుదుచ్చేరి కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు చర్చించారు. సమావేశంలో సీఎం రంగసామితో పాటు ప్రజాసులు, మత్స్యశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, కలెక్టర్ వల్లవన్, వివిధశాఖల కార్యదర్శులు హాజరయ్యారు. యానాంలో ఓఎన్జీసీ పరిహారం 24నెలలకు విడుదల చేయాలని చమురు సంస్థను కోరారు. దీనిపై కలెక్టర్, మత్స్యశాఖ కార్యదర్శికి, డైరెక్టర్‌కు సీఎం రంగసామి ఆదేశాలు జారీ చేశారని మల్లాడి తెలిపారు. యానాంలో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వరద పరిరక్షణ గట్టుకు సంబంధించి పూర్తిస్థాయిలో అన్నిశాఖల అనుమతులతో నివేదికను కేంద్రానికి పంపాలన్నారు. యానాం వైద్యశాఖలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పెండింగ్ జీతాలను విడుదల చేయాలని కోరారు. ఆరోగ్యశాఖ కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో రెండు రోజులు తర్వాత కార్యదర్శితో సీఎం మాట్లాడతారని మల్లాడి తెలిపారు. అలాగే పలు పెండింగ్ అంశాలపై సీఎంతో చర్చించినట్టు మల్లాడి తెలిపారు.

ప్రభుత్వ జీవో ప్రతులు గోదావరిలోకి..

మామిడికుదురు,జనవరి 9:అంగన్‌వాడీలు కోర్కెల సాధన కోసం నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెపై ప్రభుత్వం ఇచ్చిన జీవోలను మంగళవారం వారు పాశర్లపూడిలోని వైన తేయ నదిలో కలిపారు. కోర్కెల సాధన కోసం తాము కష్టాలు ఎదుర్కొంటూ సమ్మె నిర్వహిస్తుంటే ప్రభుత్వం అణచివేసే ధోరణిలో ఉత్తర్వులు ఇస్తుందని, ఎస్మా చట్టం ప్రయోగిస్తారని భయపెడుతుందని ఎద్దేవా చేశారు. ఏచట్టానికి భయపడనని, కోర్కెల సాధన కోసం తాము నిరవధిక సమ్మె చేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

మండపేట: అంగన్‌వాడీలు ప్రభుత్వం తీరుకు నిరసనగా మంగళవారం అంగన్‌వాడీలు, కలవపువ్వు సెంటరు నుంచి ర్యాలీగా వెళ్లి స్థానికంగా వున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి అంగన్‌వాడిలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మామిడికుదురు: పాశర్లపూడి వైనతేయ నదిలో ప్రభుత్వ జీవో ప్రతులను కలుపుతున్న అంగన్‌వాడీలు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన ఏడిద వాసులు



ఎమ్మెల్యే వేగుళ్ల, గంటి హరీష్‌మాధుర్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు

మండపేట, జనవరి 9: ఏడిదకు చెందిన వైసీపీ శ్రేణులు మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అమలాపురం టీడీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ సమక్షంలో టీడీపీ తీర్థం తీసుకున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, అందుకే వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్టు వారు తెలిపారు. వైసీపీ శ్రేణులు పైడిమల్ల లచ్చయ్య, లంక చిన్న, బొడ్డపాటి వినోద్‌కుమార్, నాగు, సునీల్‌కుమార్, వేమగిరి చాచా, పలివెల నాని టీడీపీలో చేరారు. వారికి హరీష్, వేగుళ్ల పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ కార్యక్రమంలో స్థానిక నేతలు కోలుపోటి బాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాద ప్రసాదరావు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం రావటం ఖాయం

రాష్ట్రంలో దళిత పథకాలు రద్దుచేసి దళితులకు వైసీపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. ఏడిదలో నిర్వహించిన బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. త్వరలో టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. గ్రామంలో దళితవాడలో వారు పర్యటించారు. కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. దళితులకు ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసిన ఘనుడు జగనే అన్నారు. టీడీపీ మేనిఫెస్టోను వారు ప్రజలకు వివరించారు. గ్రామంలో ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, వారి వెంట వున్నారు.

విద్యా దాత కృత్తివెంటి సంస్మరణ సభ

రామచంద్రపురం, జనవరి 9: రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ విద్యా సంస్థల ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో విద్యా దాత కృత్తి వెంటి పేర్రాజు పంతులు 15వ సంస్మరణ సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ కృత్తివెంటి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పూర్వవిద్యార్థులు జమ్మి రామారావు, చాగంటి శేషగిరిరావులు తల్లిదండ్రుల పేరుమీద రూ.50వేల నగదు అవార్డులను 15మంది ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందజేశారు.మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ ప్రముఖ డాక్టర్ చెలికాని స్టాలిన్, హైస్కూల్ హెచ్ఎం వీరరాఘవరెడ్డి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాగర్, పట్టణ ప్రముఖులు తటవర్తి శ్రీనివాసరావు, మోడరన్ విద్యా సంస్థల అధినేత జి.వి.రావు, చప్పిడి రమేష్ బాబు, ఎస్.ఆర్.కె.రాజగోపాల నరసరాజు, పీడీ జె.రఘురాం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అమలాపురంలో రోల్స్ రాయిస్ కారు



అమలాపురం టౌన్, జనవరి 9: అత్యంత ఖరీదైన రోల్స్‌రాయిస్ కారు మంగళవారం అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ప్రత్యక్షమైంది. చెన్నైలో స్థిరపడి ఆదిత్యరామ్ గ్రూప్ ఆఫ్ కంపెనీల చైర్మన్‌గా, సినీ నిర్మాతగా పేరొందిన రాజమహేంద్రవరానికి చెందిన పిల్లి ఆదిత్యరామ్‌కు ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు స్వగ్రామంతో పాటు అత్తవారిల్లయిన ఐ.పోలవరం మండలానికి రావడం ఆనవాయితీ. రూ.12కోట్లు విలువచేసే రోల్స్ రాయిస్ కారులో కుటుంబ సభ్యులతో కలిసి అమలాపురం వచ్చిన ఆయనకు అభిమానులు, సినీ పంపిణీదారులు ఘన స్వాగతం పలికారు. పెద్ద పండుగను మాత్రం తాను చెన్నైలోనే చేసుకుంటానని ఆదిత్యరామ్ చెప్పారు.

యానాం ప్రజాపనులశాఖ ఈఈగా చంద్రశేఖర్

యానాం, జనవరి 9: యానాం ప్రజాపనులశాఖ ఈఈగా ఆర్.చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి డీఆర్‌డీఏ స్మార్ట్ సిటీ విభాగాల అధికారిగా ఇప్పటివరకు పనిచేశారు. అనంతరం పరిపాలనాధికారి కార్యాలయంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏ మునిస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు.

డ్రోన్ పిచికారీపై అవగాహన

అంతర్వేది, జనవరి 9: అంతర్వేది, అప్పనరామునిలంక గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. రైతు లకు ఆధునిక పద్ధతుల్లో డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీవో నాగ ప్రసాద్, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివా సనగేష్, రాష్ట్ర కిసాన్‌మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, పట్టాపు సూర్యప్రకాశరావు, అడబాల రాంబాబు, పోతురాజు సురేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులతో సమీక్ష

అల్లవరం, జనవరి 9: అల్లవరం సచివాలయంలో ఉద్యోగులు, ఉపాధి సిబ్బందితో ఎంపీడీవో కృష్ణమోహన్ మంగళవారం పలు అంశాలపై సమీక్షించారు. ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈనెల10లోపు పింఛన్ల పంపిణీ పూర్తి కావాలన్నారు. ఏపీవో శ్రీనుబాబు పాల్గొన్నారు.

చెవిలో కాలీఫ్లవర్‌తో నిరసన



ముమ్మిడివరం, జనవరి 9: డిమాండ్ల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం15వరోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన శిబిరంలో వారు చెవిలో కాలీఫ్లవర్ పెట్టుకుని నిరసన తెలిపారు. విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు నిలుపుదల చేశారు. మాజీ ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిబాబు, చెల్లి వివేకానంద, నాయకులు పెన్మెత్స జగ్గప్పరాజు, చెల్లి అశోక్, గొలకోటి దొరబాబు, సీఐటీయూ నాయకులు జి.దుర్గాప్రసాద్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. శిబిరంలో ఎం.శ్రీనివాసరావు, ఎన్.అరుణకుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్ కుమార్, జి.రమేష్, ఎన్.వెంకటేష్, వై.రమణ, కె.గోవిందరాజు, వి.ప్రసాద్, సీహెచ్‌వెంకటేశ్వరరావు, బి.రమణమ్మ, మహలక్ష్మి,ఎన్.బొజ్జమ్మ, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం టౌన్, జనవరి 9: పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికై చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 14వ రోజుకు చేరుకుంది. అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి సందర్శించి సంఘీభావం తెలిపారు. పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఏఐటీయూసీ, సీఐటీయు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమ్మె శిబిరానికి తొమ్మండ్రు గోపీ, కొప్పుల బాబి నాయకత్వం వహించారు. ఎన్.శ్రీను, కె.వెంకటరావు, రాయుడు సుబ్బలక్ష్మి, మీసాల మంగ, పి.కోటేశ్వరరావు, ఎన్.మూర్తి, ఎ.దుర్గాప్రసాద్, ఎ.బాబి, ఎం.రాంబాబు, వరలక్ష్మి, అనంతలక్ష్మి, నీలావతి, తలుపులమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

కాట్రేనికోన, జనవరి 9: కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.నీలిమ ఆధ్వర్యంలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహించారు. 47మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: హాయ్ నాన్న
వెంకటరమణ	: కపాలదీవి
శ్రీలలిత	: యానిమల్
శేఖర్ స్ర్కీన్-1	: రాఘవరెడ్డి
శేఖర్ స్ర్కీన్-2	: ఆక్వామెన్
రమా	: డెవిల్
గణపతి	: ఎక్స్‌ట్రార్డనరీ
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: సలార్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: సలార్

యూటీఎఫ్ నాయకుల అరెస్టులు దారుణం

మామిడికుదురు, జనవరి 9: పెండింగ్ బకాయిల విడుదల కోరుతూ యూటీఎఫ్ రాష్ట్రశాఖ విజయవాడలో చేపట్టిన ధర్నాలో పాల్గొంటున్న నాయకుల అరెస్టులను యూటీఎఫ్ నాయకుల సమావేశం ఖండించింది. మంగళవారం వారు సమావేశమై ముందస్తు నోటీసులు, అక్రమ అరెస్టులతో సమ్మెను భగ్నం చేయాలని ప్రభుత్వం ప్రయత్నించిందని పేర్కొన్నారు. పీఎఫ్ లోను, బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు, నాయకులు టీఆర్కే గణపతిరావు, ఎం.సత్యనారాయణ, కె.నరసింహారావు, ఎ.కొండయ్య, ఆర్.శ్రీనివాసరావు, కె.సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల దీక్షలు

ముమ్మిడివరం, జనవరి 9: సమగ్రశిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె మంగళవారం 25వరోజుకు చేరుకుంది. సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్ ఎంటీలు, ఐఈ ఆర్టీలు, అక్కౌంటెట్లు, పీటీఐలు, మెస్సెంజర్లు పాల్గొన్నారు. ఎస్టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు, ఎంఈవో అసోసియేషన్, జీహెచ్ఎం అసోసియేషన్, పీడీ, పీఈటీ అసోసియేషన్, అంగన్‌వాడీ యూనియన్ కార్మికులు, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. సీఆర్పీ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనుబాబు, జిల్లా కార్యదర్శి ఎస్.వెంకట్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్ అధ్య క్షుడు కె.వెంకటేశ్వరరావు, ఐఈఆర్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రిసోర్సుపర్సన్ల డివిజన్ అధ్యక్షుడు నాగన్న, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిల్లి అప్పారావు సేవలు శ్లాఘనీయం

శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం



ద్రాక్షారామ, జనవరి 9: మాజీ శాసనసభ్యులు స్వర్గీయ పిల్లి అప్పారావు సేవలు శ్లాఘనీయమని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్‌లు అన్నారు. మంగళవారం పిల్లి అప్పారావు వర్ధంతి రామచంద్రపురం మండలంలో పలు గ్రామాల్లో నిర్వహించారు. వెంకటాయపాలెంలో పిల్లి అప్పారావు విగ్రహానికి రెడ్డి సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు. కార్యక్రమంలోటీడీపీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, టీడీపీ నాయకులు కాళా సత్యనారాయణ, రాయుడు లీలాశంకర్, మేడిశెట్టి సూర్యనారాయణ, కడియాల రాఘవన్ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, ఏపీఐడీసీ డైరెక్టరు వాసంశెట్టి శ్రీనివాస కుమార్, జడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు రాయుడు చంద్రరావు, బీసీ సంఘాల నాయకులు పిల్లి అప్పారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. నరసాపురపుపేటలో పిల్లి అప్పారావు విగ్రహానికి పీఏసీసీఎస్ చైర్మన్ కొప్పిశెట్టి ఏడుకొండలు, దంగేటి లోవరాజు పూలమాలలువేసి నివాళు లర్పించారు. ద్రాక్షారామలో విగ్రహం వద్ద పిల్లి సూర్యప్రకాష్, మండల కోఆప్షన్ సభ్యులు అహ్మద్ అలీషా, మాజీ జడ్పీటీసీ ఇంతసంతోషం, శెట్టిబలిజ సంఘం మండల అధ్యక్షుడు దొంగల శ్రీధర్, పలువురు సర్పంచ్‌లు, విగ్రహ దాత దంగేటి చినబాబు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

కె.గంగవరం: మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు నియోజకవర్గంలో చేసిన సేవలు అభినందనీయమని ఆయన మనుమడు వైసీపీ నాయకుడు వాసంశెట్టి శ్యామ్ అన్నారు. మంగళవారం అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని పామర్రులో ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. పామర్రు సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ సూరిబాబు, గంజా మూర్తి, శ్రీను పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా మెలగండి

మలికిపురం, జనవరి 9: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాజోలు సీఐ గోవిందరాజు అన్నారు. మంగళవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించి తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, ఎస్.రమేష్‌బాబు, వి.గణేష్ పాల్గొన్నారు.

కేసులు ఎత్తివేయడం దారుణం

ముమ్మిడివరం, జనవరి 9: అమలాపురంలో జరిగిన సంఘటనలో అల్లర్లు సృష్టించిన వారిపై కేసులు ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో ఇవ్వడాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ డిపార్టుమెంటు చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. పోలీసులు ఎంతో చాకచక్యంగా దోషులను గుర్తించి కేసులు పెడితే రాజకీయాల కోసం జీవోలిచ్చి కేసులు ఎత్తివేయడం దారుణమన్నారు. అల్లవరం మండలం మొగలమూరిలో అంబేడ్కర్ విగ్రహం పెట్టడానికి అభ్యంతరాలు చెబుతున్నారని, ప్రభుత్వం అక్కడ విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోతే ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తానే విగ్రహం ఏర్పాటు చేస్తానని హెచ్చరించారు.

అరాచక పాలన అంతమొందించడానికే రా.. కదిలిరా.. సభ

మామిడికుదురు, జనవరి 9: రాష్ట్రంలో నడుస్తున్న అరాచక అవినీతి, అరాచక పాలనను అంతమొందించడానికే రా.. కదిలిరా.. సభను నిర్వహిస్తున్నట్టు జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్ర బాబు నాయుడు రా.. కదిలిరా.. అనే పిలుపుతో ఈనెల29వరకు పార్లమెంటు స్థానాల్లో బహిరంగ సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. బుధవారం తునిలో జరిగే బహిరంగసభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.పార్టీ ఇచ్చిన ఆరు హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు మృతి

ఆలమూరు, జనవరి 9: పెదపళ్ల వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. రావులపాలెం మండలం ఊబలంక గ్రామానికి చెందిన ఈతకోట శ్రీనివాసరావు(45) వెదురుమూడి వెళ్లి కొత్తూరు సెంటర్ వైపు ఎలక్ట్రిక్ స్కూటర్‌పై వస్తుండగా పెదపళ్ల కోళ్లఫారం సమీపంలో వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావు అక్కడిక్కడే మృతి చెందారు. ఎస్ఐ శీనునాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి

మామిడికుదురు, జనవరి 9:పాశర్లపూడి హైవేవిస్తరణలో భాగంగా మంగళవారం పాశర్లపూడి హైస్కూలు సమీపంలో ఎలక్ట్రిక్ పనులు చేస్తున్న వేగి వెంకటేశ్వరరావు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. అతడు 30ఏళ్లగాప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఎస్ఐ పి.సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14న గోదా కల్యాణం

ఆత్రేయపురం, జనవరి9: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. భోగి పండుగ సందర్భంగా ఈనెల14వతేదీ ఉదయం 8గంటలకు గోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఇప్పటికే అనేక మంది యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో ముందుగానే టిక్కెట్లు తీసుకున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనదలచిన భక్తులు వివరాలకు 9491000085 నెంబరును సంప్రదించాలని ఈవో కోరారు.